క్లుప్తంగా

10వ తేదీ నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణంలోని పలు వార్డు సచివాలయాలు, పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10, 11వ తేదీల్లో నాగుల చెరువు సచివాలయం, 9వ సచివాలయం.. 12, 13వ తేదీల్లో ఏపీ స్కూల్, 9వ సచివాలయం.. 24, 25వ తేదీల్లో 9వ వార్డు యంపీఎల్ స్కూల్, నేతాజీ నగర్ యంపీఎల్ హైస్కూల్.. 26, 27వ తేదీల్లో 14వ వార్డు యంపీఎల్ స్కూల్, నేతాజీ నగర్ యంపీఎల్ హైస్కూల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాలికలు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి



ప్రత్తిపాడు: బాలికలు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిక్కిరెడ్డిపాలెం డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు శారీరక వ్యాయామాలు, క్రీడలు, ఆటల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. హాజరైన సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ.. బాలికలు వ్యాయామాన్ని దినసరి కార్యక్రమంగా మార్చుకోవాలన్నారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అదే విధంగా సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సుభాషిణి, కె.శ్రీదేవి, బి.శోభారాణి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కాకుమాను: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నమ్మదగిన సమాచారంతో కాకుమాను పోలీసులు దాడి చేసి శుక్రవారం పట్టుకున్నారు. పట్టుకున్న రేషన్ బియ్యం, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పృథ్వీ తెలిపారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆయన అన్నారు. సమాచారం రావడంతో దాడి చేసి 15 బస్తాల రేషన్ బియ్యం, వాహనం, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ బోర్డు సభ్యుడు మృతి



పెదకాకాని: అనారోగ్యంతో నంబూరు పంచాయతీ వార్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు జంగా శేషిరెడ్డి మృతి చెందాడు. మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన జంగా శేషిరెడ్డి ప్రస్తుతం గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యుడిగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ ఆయన మరణించాడు. మృతుని చిన్న కుమారుడు జంగా శ్రీనివాసరెడ్డి గతంలో ఎంపీటీసీ సభ్యునిగా పనిచేశారు. మృతునికి భార్య వెంకట సుబ్బమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు నేడు

పొన్నూరు పట్టణంలో త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ (ఈదుల్ అజ్‌హా)పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ముస్లిం సోదరులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులోని ఈద్ గాతో పాటు మసీదులలో సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ప్రత్యేక ప్రార్థనల కోసం అంజుమన్ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా షామియానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఈద్గా నమాజ్ జరుగుతుందని అంజుమన్ కమిటీ అధ్యక్షులు మగ్బుల్ బేగ్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మసీదుల్లో ప్రార్థనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాలను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు.

ఆయుర్వేదాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకృతి వైద్య విధానం ఆయుర్వేదం అనేక రుగ్మతలకు చక్కటి పరిష్కారం చూపుతోందని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. శ్రీధరియం ఆయుర్వేదిక్ ఐ క్లినిక్, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని ఆంధ్ర ప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం సమాచార పోస్టర్‌ను శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల కార్యదర్శి డా. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డా.సీతారామయ్య, హైందవ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు టి.శివశంకర్ పాల్గొన్నారు.

మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా విత్తన ఏటీఎంలు
- ప్రైవేట్ దుకాణాల్లో రైతులు అధిక ధరలకు కొనుగోళ్లు
- పథకాన్ని నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం



వెనిగండ్ల రైతు సేవా కేంద్రం

పెదకాకాని: నాడు రైతులకు మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు మూలనపడి వెక్కిరిస్తున్నాయి. ఆధునిక సాంకేతికతతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించింది. ఫలితంగా అయిదేళ్లు రైతు దర్జాగా రారాజుగా బతికాడు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అన్నీ అందేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఈ సౌకర్యాలు చేతికందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, పొన్నూరు రూరల్, చేబ్రోలు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు స్పాట్ బుకింగ్ కోసం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు మూలన పడ్డాయి. వాటి వినియోగం లేకపోవడంతో కొన్ని చోట్ల మరమ్మతులకు గురైయ్యాయి. దీంతో కియోస్క్ యంత్రాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరో వైపు గత ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందించగా ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను డొల్ల కేంద్రాలుగా మార్చి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంలో విఫలమైంది. చేసేదేమీ లేక రైతులు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులను ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి జేబుకు చిల్లు పెట్టుకుంటున్నారు.

గతంలో రాయితీలపై అందించేవారు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కియోస్క్ యంత్రాల ద్వారా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతులకు గ్రామంలోనే అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో తక్కువ ధరకు రాయితీపై అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా రైతు సేవా కేంద్రాలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకూ కనీసం పచ్చిరొట్ట వేసుకునేందుకు అవసరమైన పిల్లిమిసర, జనుము, జీలగ విత్తనాలు కూడా పూర్తి స్థాయిలో పంపిణీకి నోచుకోలేదు. గడిచిన ఏడాది విత్తనాలు లేదా ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయలేదు. ఫలితంగా ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసి పంటలు సాగు చేశారు. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే ప్రభుత్వం ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తెచ్చి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

డిజిటల్ విధానం అమలు చేయాలి



ప్రభుత్వం డిజిటల్ విధానం అమలు చేయాలి. గత ప్రభుత్వం డిజిటల్ విధానంలో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు రైతులకు డిజిటల్ ద్వారా సేవలను తెలియజేసేవారు. ఈ యంత్రాల ద్వారా పంట సాగులో రైతులకు అవసరమైన సమాచారం కూడా తెలిసేది. ఇప్పుడు డిజిటల్ సేవలు కూడా అందించాలి.

– షేక్ నజీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ, మాజీ కోఆప్షన్ సభ్యుడు

అనధికారంగా ట్యాంకర్లు తరలించే వారిపై వేటు

- ఏఈ రవికిరణ్ సరెండర్
- ఇద్దరు రిజర్వాయర్ సిబ్బందిని విధుల నుంచి తొలగించిన కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ తాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అనధికారికంగా తాగునీటిని ట్యాంకర్ల ద్వారా తరలించడం గమనించి, గతంలో హెచ్చరించిన పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏఈ రవి కిరణ్‌ని సరెండర్ చేయాలని, రిజర్వాయర్ సిబ్బంది శేషయ్య, నాగరాజులను విధుల నుంచి తొలగించాలని ఎస్ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ తాగునీటి సరఫరా అనధికార తరలింపుపై తమకు అందిన ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ను తనిఖీ చేశారు. ట్యాంకర్ల వివరాలు నమోదు రిజిస్టర్‌ని పరిశీలించి, రిజిస్టర్‌లో వివరాలకు, నీటిని తరలిస్తున్న ట్యాంకర్ల వివరాలకు వ్యత్యాసం ఉండడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు రిజర్వాయర్‌లో అనధికార నీటి తరలింపుపై గతంలో కూడా అందిన ఫిర్యాదుల మేరకు విధుల్లో సక్రమంగా ఉండాలని హెచ్చరించినా పని తీరు మార్చుకోని ఏఈని తన మాతృ శాఖకు సరెండర్ చేయాలని, సిబ్బందిని ఆప్కాస్ నుంచి పూర్తిగా తొలగించాలని ఎస్ఈకి సూచించారు. నగరంలో రోజువారీ పర్యటనల్లో రిజర్వాయర్ తనిఖీలు చేస్తామని, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. తాగునీటి సరఫరాపై గత పర్యటనలో ఇచ్చిన ఆదేశాలను పాటించని ఇంజినీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డిపాడు ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఆర్ఓబీ మంజూరు దృష్ట్యా, పనులు ప్రారంభమైతే ప్రత్యామ్నాయంగా వెనిగండ్ల, ఆటో నగర్ రోడ్లను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీఎన్ కాలనీలో పలు ప్రాంతాల్లో చేపట్టిన రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, షేక్ మీరావలి, డీఈఈలు నాగభూషణం, రమేష్ బాబు, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఎన్వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



బీఆర్ స్టేడియంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజలు చేతి సంచులను వాడాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా రూ.20కే నాణ్యమైన గుడ్డ సంచులను అందించేలా ప్రత్యేకంగా వెండింగ్ మెషిన్లను అందుబాటులోకి తెచ్చామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం గాంధీ పార్క్ దగ్గర ఏర్పాటు చేసిన గుడ్డ సంచుల వెండింగ్ మెషిన్, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ పాయింట్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లల్లో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను కేజీ ఇస్తే గాంధీ పార్క్‌లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని చెప్పారు. పర్యావరణ హిత, క్లీన్ గుంటూరు సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు గాంధీ పార్క్ దగ్గర ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: ఈ నెల 11వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం వెళ్లే శివ భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన బయలుదేరి 10వ తేదీన కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, అదే రోజు రాత్రి అక్కడకు చేరుకుంటామని తెలిపారు. 11వ తేదీ గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం చేసుకున్న అనంతరం సాయంత్రం బస్సు బయలుదేరి 12వ తేదీ గుంటూరు చేరుకుంటుందని వివరించారు. బస్సులో టికెట్ల కోసం 96164 సర్వీస్‌లు ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.2,420 ఉంటుందని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

లక్ష్మీపురం: వివాహిత అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ జమీర్ ఆటో వేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడు. రజియాతో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం. రజియా గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాకపోవడంతో భర్త రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజు అందాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, డ్రామా స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ ,చెస్, క్యారమ్స్, క్విజ్ అంశాల్లో నిర్వహించిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, గుళ్లపల్లి ట్రస్టు ప్రతినిధి గుల్లపల్లి సుబ్బారావు, గుళ్లపల్లి వీబీ ప్రసాద్ లింగం, కేవీ రమణ, ఏవీకే సూజాత, ఉప గ్రంథపాలకురాలు కె.జాన్సీలక్ష్మి పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులతో సుబ్బరత్నమ్మ, కన్న మాస్టారు

గార్డెన్స్ గ్రంథాలయంలో...

బృందావన్ గార్డెన్స్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో శిక్షణ పొంది, వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గ్రామ పరిశుభ్రతకు యాక్షన్‌ప్లాన్



గ్రామస్తులతో మాట్లాడుతున్న నాగసాయికుమార్

ప్రత్తిపాడు: గ్రామం పరిశుభ్రంగా కనిపించేందుకు కావాల్సిన యాక్షన్ ప్లాన్‌ను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం గ్రామ పంచాయతీ మోడల్ గ్రామంగా ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో డీపీవో పర్యటించారు. స్థానిక రచ్చబండ దగ్గర గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్పెషల్ టీంలు కల్పిస్తున్న అవగాహనను పరిశీలించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ చెత్త, వ్యర్థాలను బయట పడేయవద్దన్నారు. గ్రామం పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉండేందుకు సహకరించాలని ఆయన మహిళలను కోరారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించేందుకు వట్టిచెరుకూరు, పెదనందిపాడు, గుంటూరు రూరల్, ప్రత్తిపాడు మండలాల నుంచి 50 మంది సెక్రటరీలను తుమ్మలపాలెంకు డెప్యూటేషన్ వేశారు. ఒక్కో టీంకు ముగ్గురు చొప్పున 17 టీంలు ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, క్లాత్ బ్యాగుల వినియోగం, గ్రామ పరిశుభ్రంగా ఉంచడం వంటి అనేక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండలం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ ఆర్‌పీలు నిరంజన్, అనురాధ, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్‌లు



డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచి స్వరూపరాణి

పెదకాకాని: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు సమ్మర్ క్యాంప్‌లు దోహదపడతాయని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వరూపరాణి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలుకు చేరుకోవడానికి ఈ సమ్మర్ క్యాంప్‌లు ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలలో పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ హనీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలు టెండర్ రద్దు

- నగరం అంతా తోపుడు బండ్ల వద్ద రుసుం వసూలు చేస్తున్న కాంట్రాక్టర్
- స్పందించిన కమిషనర్ విచారణ చేపట్టి చర్యలు
- ఆశీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని సూచన

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని సంద్రీస్ మార్కెట్ పరిధిలో చెత్త ఆస్కారం లేకుండా, ఉత్పన్నమయ్యే చెత్తను తరలించేందుకు పండ్ల వ్యాపారుల నుంచి రుసుం(ఆశీలు) వసూలు చేసే కాంట్రాక్టర్ తన పరిధి దాటి నగరంలోని వివిధ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల వద్ద నుంచి రుసుం వసూలు చేస్తున్న విషయంపై 'సాక్షి'లో ఇటీవల 'కూటమి ప్రైవేట్ దోపిడీ'పై కథనం ప్రచురితమైంది. దీంతో టెండర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు టెండర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పండ్ల దిగుమతి వ్యాపారులు ఆశీలు రుసుంను నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందికే చెల్లించాలని, అదే విధంగా నగరంలో తోపుడు బండ్ల వారు ఎవ్వరికీ ఆశీలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సదరు కాంట్రాక్టర్ గుంటూరు నగరపాలక సంస్థ 2025–26 సంవత్సరం గెజిట్ నిబంధనల మేరకు నిర్దేశిత అమౌంట్‌కి సంబంధించి ముందస్తు చెల్లుబాటు అయ్యే చెక్‌లను, లీజు అగ్రిమెంట్ రిజిస్టర్ చేయించి జీఎంసీకి అందించనందున వారికి కేటాయించిన రుసుం వసూళ్లు చేసుకునే హక్కును ఈ నెల 4వ తేదీ నుంచి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో తోపుడు బండ్ల వారు ఎవ్వరికీ ఆశీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా వసూలు చేస్తే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103కి ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం అన్యాయం

ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

లక్ష్మీపురం: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మంగా శ్రీనివాస్ మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్‌లో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర వివిధ ఆటో స్టాండ్‌ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని, సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం చేస్తానని, 21, 31 జీవోలను రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చెందారు. తక్షణమే ఉచిత బస్సు హామీని విరమించుకోవాలని ఉచిత బస్సు వలన కొన్ని లక్షల ఆటో కార్మికులు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడతాయని గుర్తు చేశారు. గుంటూరు జిల్లాలో బాగా పెరిగినాయని ఈ ఆటోలకు గ్యాస్ నింపుకోవడానికి గ్యాస్ కేంద్రాలు మూడు మాత్రమే ఉన్నాయని వీటిని రెట్టింపుగా పెంచాలని కోరారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు ఎండీ బాబర్, యూనియన్ నాయకులు ఎస్కే గఫర్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

లక్ష్మీపురం: సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి చంద్ర రాజేశ్వరరావు జయంతి శుక్రవారం నిర్వహించారు. నగరంలోని కృష్ణా నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు పార్కులో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్వాతంత్ర్య పోరాటానికి అంకితమై, స్వరాజ్య సాధనకే కాక, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కొటా మాల్యాద్రి అనంతరం ప్రసంగించారు.

కమనీయం.. బ్రహ్మేశ్వరుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో కొలువైన శ్రీ గంగా భ్రమరాంబికా సమేత బ్రహ్మేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి శాస్త్రోక్తంగా వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ వైభవోపేతంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం దేవతామూర్తులను ప్రత్యేకంగా ముస్తాబు చేసిన రథంపై ఉంచి గ్రామంలో రథోత్సవాన్ని జరిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి రథం లాగేందుకు భక్తులు పోటెత్తారు. హరహర మహదేవా.. అంటూ కోలాహలంగా రథోత్సవం ముందుకు సాగింది.



నేత్రపర్వంగా స్వామి వారి రథోత్సవం